క్లుప్తంగా

ఆంగ్లంపై పట్టుతో ముందడుగు



ఆంగ్ల భాషా దినోత్సవంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంగ్ల భాషపై పట్టు సాధించడం ద్వారా అన్ని రంగాల్లో ముందడుగు వేసే అవకాశం ఉంటుందని సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ విభాగాధిపతి ఆర్.మాధవి అన్నారు. ఆంగ్ల భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో శుక్రవారం వృత్తి విద్యా కాశాల్లో ఆంగ్ల భాష ప్రాముఖ్యత అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వక్తగా మాధవి మాట్లాడుతూ ప్రముఖ ఆంగ్ల రచయిత విలియమ్ షేక్స్పియర్ జనన, మరణ దినం సందర్భంగా ఏప్రిల్ 23న ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. వివిధ దేశాల్లో ఆంగ్ల భాష ఉచ్ఛారణలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌ఆర్ మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అనురాధ, ఐక్యూసీ కోఆర్డినేటర్ కె.రూసీ లక్ష్మి, ఆంగ్ల భాష విభాగం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్ల జోళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ఏలూరు డిపో సిబ్బందికి ఆశ్రం కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం కళ్ల జోళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆశ్రం కళాశాల వైద్యులు డాక్టర్ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఆశ్రం వైద్య కళాశాల సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రయాణీకులను తమ గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ సిబ్బంది ఉష్ణోగ్రతలను, వడగాల్పులను సైతం లెక్క చేయకుండా సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, అసిస్టెంట్ మేనేజర్ సి.రాంబాబు, సీజీ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

పెదపాడు: వృద్ధుడు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు మండలంలోని వేంపాడుకు చెందిన మరీదు రాము వృద్ధాప్యం కారణంగా ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం ఉదయం 11గంటల సమయంలో భార్య గేదెలను కట్టి రమ్మని పంపించింది. అప్పటి నుంచి కనపడకపోవడంతో కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 గ్రామాలు.. 170 చ.కి.మీ. విస్తీర్ణం

- 42,752 ఎకరాల భూమి గుర్తింపు
- ఏలూరు మండలంలో డ్రోన్ సర్వే పూర్తి
- త్వరలో సరిహద్దు రాళ్ల ఏర్పాటు



డ్రోన్ ద్వారా భూముల సర్వే చేపట్టిన తహసీల్దార్ సోమశేఖర్ (ఫైల్)



రోవర్ వ్యవస్థ పనితీరు పరిశీలిస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీటీ) రమణ (ఫైల్)

ఏలూరు రూరల్ : ఏలూరు మండలంలో భూముల రీ సర్వే పూర్తయింది. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సర్వే ఆఫ్ ఇండియా అనుమతి పొందిన పలు సంస్థల సిబ్బంది డ్రోన్ సర్వే చేశారు. ఏలూరు మండలంలో 15 గ్రామాల విస్తీర్ణం 170 చదరపు కిలో మీటర్లుగా తేలింది. ఇందులో 42,752 ఎకరాల అన్ని రకాల భూమి ఉన్నట్టు గుర్తించారు. సర్వే వివరాలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశారు. వీటి ఆధారంగా త్వరలో సచివాయల సర్వేయర్లు, వీఆర్వోలు క్షేత్ర స్థాయిలో పర్యటించి సరిహద్దు రాళ్లు వేస్తారు.

మండలంలోని గ్రామాలు

మల్కాపురం, మాదేపల్లి, శ్రీపర్రు, కలకుర్రు, జాలిపూడి, కాట్లంపూడి, చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, పైడిచింతపాడు, కోమటిలంక, మొండికోడు, పెద యాగనమిల్లి

ఐదు రోజుల సర్వే

మండలానికి ఒక డ్రోన్ ఏర్పాటు చేశారు. రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూమి మొత్తాన్ని సిబ్బంది డ్రోన్ ద్వారా సర్వే చేశారు. మొదట రెవెన్యూ అధికారులు గ్రామాల్లో భూమిని విస్తీర్ణాన్ని బట్టి రెండు లేక అంతకంటే ఎక్కువ భాగాలుగా విభజించారు. ఒక్కొక్క భాగానికి నాలుగు పక్కలా సరిహద్దు రాళ్లు ఏర్పాటుచేశారు. ఈ రాళ్ల మధ్య ఉన్న మొత్తం భూమిని డ్రోన్ ద్వారా కొలిచారు. డ్రోన్ ఒకసారి గాలిలో ఎగరేసి నాలుగు నుంచి 12 చదరపు కిలో మీటర్ల భూమిని కొలిచారు. రోజుకి ఐదు నుంచి ఆరు సార్లు ఏగరేసి 30 నుంచి 35 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో భూమి కొలతలను రికార్డు చేశారు. ఇలా ఐదు రోజుల పాటు పదుల సంఖ్యలో డ్రోన్‌ను గాలిలోకి ఎగరేసి సర్వే పూర్తి చేశారు. జియో ట్యాగింగ్ ద్వారా నిర్వహించిన ఈ కొలతల వివరాలన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశారు. వీటిని ఫైల్ చేశారు. వీటినే ఎంకేఎల్ ఫైల్స్ అని పిలుస్తున్నారు. సర్వే ప్రక్రియలో తహసీల్దార్, సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, వీఆర్వోతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్‌ఐ మ్యాప్‌లో సర్వే వివరాలు

డ్రోన్ ద్వారా సేకరించిన సర్వే వివరాలన్నీ ఆర్థో రిక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్‌ఐ) ద్వారా గ్రామ సర్వేయర్ తెలుసుకోవచ్చు. భూమి కొలతలు, సరిహద్దులు గుర్తించడంలో ఇది ఎంతో దోహదం పడుతుంది. ఇక నుంచి భూమి సర్వే చేయాలని ఎవరైనా రైతు కోరిన మీదట ఓఆర్‌ఐ మ్యాప్ ద్వారా సర్వేయర్, వీఆర్‌ఓ కలిసి క్షేత్ర స్థాయికి వెళ్లి సులువుగా భూమి కొలతలు గుర్తించవచ్చు.

గొలుసు కొలతకు చెక్

సర్వే మొత్తం ప్రక్రియ పూర్తయితే గొలుసులతో భూమి కొలత విధానం ఉండదు. ఇక నుంచి భూమి కొలిచేందుకు ప్రభుత్వం రోవర్ అనే సంకేతిక వ్యవస్థ ఉపయోగించనుంది. దీని ద్వారా గట్టు, పుట్ట, చెట్టు, చేమ ఎలాంటి అడ్డంకులు ఏర్పడినప్పటికీ భూమి మొత్తాన్ని ఖచ్చితంగా కొలతలు చేయవచ్చని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

భూ సమస్యలు ఉండవు



భూములు రీసర్వే రైతులకు ఎంతో మేలు చేస్తుంది. ఏలూరు మండలంలోని 15 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశాం. త్వరలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టి సరిహద్దు రాళ్లు పాతుతాం. ఈ మొత్తం ప్రక్రియ పూర్తయితే 99 శాతం భూ సమస్యలు ఉండవు. గ్రామాల్లో రెవెన్యూ భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తం కావడంతో సర్వే విధానం మరింత సులువుగా, పారదర్శకంగా మారుతుంది.

– బి.సోమశేఖర్, తహసీల్దార్

ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): ధాన్యం రవాణాకు లారీలు, ట్రాక్టర్లు ఇతర వాహనాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరు పేటలోని అన్నే భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. వాహనాల కొరత కారణంగా ధాన్యం రవాణా నిలిచిపోయి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు లేకుండా మొక్కుబడిగా నిర్వహించడం వల్ల ప్రయోజనం లేదన్నారు. ధాన్యం పట్టుబడులకు సంచులు ఇవ్వాలని కోరారు. రవాణ వంటి సమస్యలను పరిష్క రించాలని కోరినా అధికారులు స్పందించడంలేదన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పేకాల శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ కె.ప్రసాద్‌కుమార్ పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆదేశాలతో సీఐ ప్రసాద్‌కుమార్ తన సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు, రూ.93,120, పేకాట ముక్కలు 104 స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై టూటౌన్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఏలూరు వన్‌టౌన్‌లో వ్యక్తి మృతి



ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ మార్కెట్ ప్రాంతంలో జయశ్రీ మొబైల్ షాపు ఎదురుగా రోడ్డుపైన ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది పడి ఉన్నాడు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో వడదెబ్బ కారణంగా అతను మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆ వ్యక్తిం సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, అచూకీ తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు బోధనాసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 94407 96604, 99483 31462లో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగిపై కేసు

ఏలూరు టౌన్: ఏలూరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తోన్న మహిళా ఉద్యోగి పట్ల ఆర్టీసీ గ్యారేజ్ సూపర్‌వైజర్ అసభ్యంగా ప్రవర్తించాడనే ఫిర్యాదుతో ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు ఆర్‌టీసీ డిపోలో మహిళా స్వీపర్‌పై గ్యారేజీలోని సూపర్‌వైజర్ ఎండీ మస్తాన్ అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధిస్తున్నాడంటూ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని, అందుకే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. మహిళ ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెదపాడు: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. దీంతో పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. దెందులూరు మండలంలోని మసీదుపాడుకి చెందిన ఎం.దుర్గాభవానిని ఆమె భర్త రాజేష్ మూడేళ్ల క్రితం పాతముప్పర్రులోని పుట్టింటి వద్ద వదిలేశాడు. దీంతో ఆమె మనస్తాపం చెందిన ఆమె గురువారం ఉదయం 7 గంటల సమయంలో ఉరి వేసుకుంది. పరిస్థితిని గమనించిన తల్లి ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం దుర్గాభవాని మరణించింది. తల్లి సానబోయిన శాంతకుమారి ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు పెద్దన్నలా సీఎం జగన్

ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు 38వ డివిజన్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ప్రతిమహిళా లక్షాధికారి కావాలనే ఉన్నత లక్ష్యంతో మహిళలకు అనేక పథకాలు అమలు చేస్తూ కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దన్నలా ఉన్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 95వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏలూరు టూటౌన్ ప్రాంతంలోని 37, 38వ డివిజన్లలో ఇంటింటికీ వెళుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించారు. 37వ డివిజన్ కార్పొరేటర్ తోలేటి అన్నపూర్ణ, 38వ డివిజన్ కార్పొరేటర్ తోట హేమమాధురీ, పార్టీ నాయకులు తోట సుధీర్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి అపూర్వ స్వాగతం పలికారు. ఆర్‌ఆర్‌పేట సుబ్బమ్మదేవి నగరపాలక పాఠశాల ప్రాంతం నుంచి నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళలకు పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. సర్పంచ్ నుంచి కార్పొరేషన్ మేయర్ వరకు, నామినేటెడ్ పదవుల నుంచి మంత్రుల వరకు మహిళలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ రాజకీయంగానూ ముందంజ వేసేలా ప్రోత్సహిస్తున్నారని నాని చెప్పారు. మహిళలంతా రాబోయే 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. టీడీపీ హయాంలో చంద్రబాబు మహిళలను ఎంత ఘోరంగా మోసం చేశారో అందరూ చూశారని, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని నమ్మించి దగా చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, యర్రంశెట్టి సుమన్, మాజీ డిప్యూటీ మేయర్ గంపల బ్రహ్మావతి, పార్టీ నాయకులు కిలాడి దుర్గారావు, తొట శివ, భోగిశెట్టి పార్వతి, తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	42
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	54	అల్లం	130
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	18	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	60
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	30
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33



విద్యుత్ కాంతులతో నెహర్ మజ్జిద్ మినార్



పెన్షన్‌మహల్లా మజ్జిద్



లక్ష్మీవారపుపేట మజ్జిద్

నేడు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

ప్రార్థనా ప్రాంగణాలు, మసీదులు సిద్ధం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రంజాన్ నెల ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ముస్లింలు శనివారం ప్రత్యేక ప్రార్థనలకు సన్నద్ధమయ్యారు. నగరంలోని వివిధ ప్రార్థనా మైదానాలు, మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రార్థనలకు అనువుగా టిప్‌టాప్ పందిళ్లు వేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. వంగాయగూడెం రోడ్డులోని ఈద్‌గాహ్ ప్రాంగణంలో ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు, అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో పాత బస్టాండు సెంటర్‌లోని కర్బలా మైదానంలో ఉదయం 9.30 గంటలకు ప్రార్థనలు ప్రారంభించనున్నారు. ఈ ప్రార్థనల్లో ముస్లిం మతపెద్దలు రంజాన్ మాసం ప్రాశస్త్యాన్ని వివరించనున్నారు. జకాత్, ఫిత్రా దానాల ప్రాధాన్యతలపై అవగాహన కలిగిస్తారు. లక్ష్మీవారపు పేటలోని అహలే హదీస్ మసీదులో ఉదయం 7, ఉమర్ ఏ ఫరూఖ్ మసీదులో ఉదయం 7.30, మర్కజ్ ఈనామ్ మసీదులో ఉదయం 8.30, తంగెళ్లమూడిలోని నెహర్ మసీదులో ఉదయం 9, రాణీ నగర్‌లోని పురానా మసీద్‌లో ఉదయం 9, నయా మసీదులో ఉదయం 9.10 గంటలకు ప్రార్థనలు ప్రారంభించనున్నారు. జామియా, చౌక్, ఖురేషీ, నాథూమియా, మదీనా, అక్కిలేట్, ఎంఎం కాలనీ, మాదేపల్లి, గేట్, జమీరాత్, బీడీ కాలనీ, ఇస్లాంపేట, ఫాతిమా, జిల్లా, శనివారపుపేట, దొండపాడు, మహ్మదీయ, వైఎస్ఆర్ కాలనీ, తబ్‌లిక్ జమాత్, నూర్ మసీదుల్లో సైతం ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాటు చేశారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): దెందులూరు మండలం దోసపాడు పేదలు చేస్తున్న పోరాటాన్ని అణచివేయాలని చూస్తోన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, 9/77 చట్టాన్ని అమలు చేయాలని, సెక్షన్ 24 ప్రకారం పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దోసపాడు పేదలు గత ఏడాది నుంచి అసైన్డ్, సీలింగ్, గయ్యాళ భూములు పంచాలని పోరాడుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. ఆ భూములను పేదలకు పంచాలని కోరారు. భూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తోన్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

నేటి నుంచి వీఆర్వో విధులపై శిక్షణ

పెదపాడు: వట్లూరు గ్రామ సచివాలయం-2లో అసిస్టెంట్ కలెక్టరు అపూర్వ భరత్ వీఆర్వో శిక్షణ తీసుకోనున్నారు. ఆయన సచివాలయానికి శుక్రవారం చేరుకున్నారు. శనివారం నుంచి 4 వారాల పాటు ఆయన శిక్షణ తీసుకోనున్నారు. వట్లూరు వీఆర్వోలు ఆర్‌ఏఎస్‌ఆర్ చంద్రమూర్తి, వీఆర్వో రవికుమార్ తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

దోసపాడులో పోలీస్ పికెట్

దెందులూరు: దోసపాడులో శుక్రవారం మరోసారి దళితులు, సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఏళ్ల తరబడి దళితుల భూములు పెద్దల చేతుల్లో కబ్జాకు గురయ్యాయని, వాటిని పేదలకు పంచాలని దళిత సంఘాలతో పాటు కమ్యూనిస్టు నాయకులు ఉద్యమం చేస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో భూములు స్వాధీనం చేసుకుంటామని వెళ్తున్న సందర్భంలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు, పెదవేగి సీఐ ఎస్.దుర్గా ప్రసాద్ సకాలంలో స్పందించి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దోసపాడులో హుటాహుటిన పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వివాదాస్పద భూముల వద్దకు ఎవరినీ వెళ్లనీయకుండా గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య 144 సెక్షన్ విధించారు. ఎట్టకేలకు గ్రామంలో, వివాదాస్పద భూముల వద్ద ఎటువంటి సమస్య తలెత్తకపోవడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.